www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023





## 26న రక్తదాన శిబిరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 26వ తేదీన రాయచోటి రెవెన్యూ కార్యాలయం వద్ద పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలు స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. జిల్లాలోని సిఐటియు శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి, యువకులు, ప్రజాతంత్ర అభ్యుదయవాదులందరూ పాల్గొని రక్తం అవసరమైన వారికి రక్తాన్నిచ్చి ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ డిస్కం కార్యదర్శి సుబ్రహ్మణ్యం రాజు, నాగేశ్వర గౌడ్, గజా నాయుడు రామకృష్ణ, రెడ్డిరాజులతో పాటు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్, నాయకులు వి.వినయ్ పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష' పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఎంపిడిఒలు, తహశీల్దార్లతో విసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లాలోని అధికారులందరూ బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా పని చేయలన్నారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరించాలన్నారు. రేపు జరగబోయే వాలంటీర్ల ఇంటింటి సందర్శన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామ సర్పంచ్, గృహ సారథులు, సచివాలయం పంచాయతీ సెక్రటరీ, డిఆర్డిఎ నుంచి ఒక రిసోర్స్ పర్సన్, ఇంటింటికి వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్లు, ఎంపి డిఒలు కచ్చితంగా విజిట్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లినప్పుడు అనేక రకాల సమస్యలు వస్తాయని, ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని తప్పక తీసు కోవాలన్నారు. సర్వే జరిగే గ్రామాలలో ముందు రోజు సాయంత్రం క్యాంపు నిర్వహించే ప్రాంతము టైం ప్రజలకు టామ్ టామ్ ద్వారా తెలియజేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేకు షెడ్యూల్ పంపాలని నియోజకవర్గ మండల ప్రత్యేక అధికారికి సూచించారు. సచివా లయాల పరిధిలో ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా వాలంటీర్లు 100 శాతం ఇంటింటికి వెళ్ళాలన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళుతున్నారా లేదా అనేది ఎంపిడిఒలు పరిశీలన చేయాలన్నారు. ప్రతి సచివాలయానికి ఒక మండల్ లెవల్ అధి కారిని ఇన్‌ఛార్జిగా నియమించి కార్యక్రమంలో ఎటువంటి సమస్యలు తలెత్త కుండా చూడాలని ఎంపిడిఒకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ దృవీకరణ, వివాహ ధ్రువీకరణ, మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసం ధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్‌లో ప్రజల సమస్యలను నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమ స్యను పరి ష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా సమస్యలపై డిజిటల్ అసిస్టెంట్లు ఈ సర్వీస్ ద్వారా తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం కల్లా ఎన్ని అర్జీలు వచ్చాయి తదితర వివరాలతో కూడిన రిపోర్టు తమకు పంపాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్ర మానికి సంబంధించి కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇందులో ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లినప్పుడు చాలా ఓపికగా, సహనంతో, మర్యాదగా వారి సమస్యను విని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, డిపిఒ ధనలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కో-ఆర్డినేటర్ మనోహర్‌రాజు, జడ్‌పి కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# 'బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి'

ప్రజాశక్తి-రాయచోటి

బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణం, చట్టానికి లోబడి పండుగను జరుపుకోవాలని కలెక్టర్ గిరీష అన్నారు. ఈ నెల 29 నుండి ప్రారంభమయ్యే బక్రీద్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ఎస్పి గంగాధర్‌రావుతో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల పెద్దలతో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మత సామరస్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని, అందరి సహకారం వల్లనే ఇది సాధ్యమైందని, ఇలాంటి సహకారాన్ని ఇలాగే కొనసాగించాలని కోరారు. బక్రీద్ పండుగను ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సున్నితమైన సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూ శాఖలకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. క్రితం ఏడాది లాగానే ఈసారి కూడా అందరూ సంతోషంగా పండుగ జరుపుకునే విధంగా అవగాహన కల్పించాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాత్కాలిక జంతు వధశాలలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పారిశుద్ధ్యం అలాగే అవసరమైన నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, వేస్ట్‌ను దూరంగా జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కోవిడ్ పూర్తిస్థాయిలో లేకున్నా కోవిడ్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని పేర్కొన్నారు. సామాజిక దూరం, శానిటేషన్, మాస్క్ ధరించాలన్నారు. ముఖ్యంగా స్లాటర్ హౌస్ వద్ద గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, మత సామరస్య కమిటి సభ్యులు కూడా తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఎస్పి గంగాధర్‌రావు మాట్లాడుతూ బక్రీదు పండుగ సందర్భేగా అన్ని మతాల వారు పరస్పరం సహకరించుకొని సోదర భావంతో పండుగను జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బక్రీద్ పండుగను ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు, వివిధ మత పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, చిత్రంలో ఎస్పి గంగాధర్‌రావు

**మదనపల్లె అర్బన్:** ఆత్మీయత ఆదరణకు ప్రతీక, త్యాగానికి అద్దం పట్టే బక్రీదు పండుగను ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని డిఎస్‌పి కె.కేశప్ప పేర్కొన్నారు. శుక్రవారం డిఎస్‌పి కార్యాలయంలో సబ్ డివిజనల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి బక్రీదు పండుగకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందజేశారు. సమావేశంలో మదనపల్లి టూ టౌన్ సిఐ మురళీకృష్ణ, వన్ టౌన్ సిఐ మహబూబ్ బాషా, తాలూకా సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు సుబ్బారెడ్డి, హరిహరప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

## రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**- ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు**

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని విధాల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పిసిఆర్ గ్రౌండ్‌లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.అల్లా బకాష్ సిఎల్‌పి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎపిసిసి అధ్యక్షులతో పాటు ఎఐసిసి సభ్యులు మొయ్యప్పన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని తెలిపారు. అమరావతి సమీపంలో బాలికపై అత్యాచారం జరిగితే ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో అభివృద్ధిని పక్కన పెడితే వైన్ మాఫియా షాన్ మాఫియా, లిక్కర్ మాఫియా వంటి రౌడీ రాజకీ యాలే ఎక్కువయ్యాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వేలాది మందికి ఉపాధి చూపించినప్పుడే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బి అంటే బాబు జె అంటే జగన్ పి అంటే పవన్ కళ్యాణ్ అని బిజెపిలో ఐక్యమయ్యాయని అభివృద్ధి మాత్రం శూన్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని నాలుగు సంవత్సరాలు జగన్మోహన్‌రెడ్డి, 9 సంవత్సరాలు చంద్రబాబు నాయుడు పరిపాలించారని, అయినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే ఉందని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసులకు ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టు అయిన అన్నమయ్య ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులకు కావలసిన డబ్బును ఇవ్వక పోవడంతో ప్రాజెక్ట్ తెగి ముంపు నివాసితులకు చాలా ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇది జరిగి సుమారు రెండు సంవత్సరాల కాలం గడుస్తున్న నేటికీ బాధితులను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్, అన్నమయ్య జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మదనపల్లి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో వై.సురేంద్రర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

## వైసిపి ప్రభుత్వంలోనే దళితులపై దాడులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గత ప్రభుత్వాలకు భిన్నంగా వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం జిల్లా తిరుమలాయపాలెంలో దళితులపై జరిగిన దాడులను అరికట్టాలని, బాధ్యులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దాడులు జరిపిన వారిపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మాలమహానాడు ఆధ్వర్యంలో అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

## జాక్‌పాట్ 10 శాతం కమీషన్ వసూలుపై నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో 10 శాతం కమీషన్ వసూలు, జాక్ పాట్ విధానంపై తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులతో కలసి నిరసన తెలిపారు. శుక్రవారం మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మార్కెటింగ్ ఎడిఎం తళ్లూరి త్యాగరాజు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి అభిలాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఎడిఎం వెంటనే స్పందిస్తూ రానున్న మూడు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై టిడిపి నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో మండి యాజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన 4 శాతం కమీషన్ స్థానంలో పది శాతం కమీషన్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే కాకుండా కిరిట్‌కు బాడుగ, కూలీ కింద మరో మూడు శాతం తీసుకోవడం దుర్మార్గమని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించి మార్కెట్‌కు టమోటాలు అమ్ముకోవడానికి తీసుకువచ్చిన రైతుకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని అధికారులు ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు విజయమ్మ, నరసింహారెడ్డి, జి.వి.నాయుడు, మాజీ సర్పంచ్ శివ, రామాచార్లపల్లి రమణ, రాజన్న, సుధాకర్, కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

# బడి బస్సు భద్రమేనా?

- నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలు
- పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న వైనం
- జిల్లాలో 154 ఫిట్‌నెస్ లేని బస్సులు



ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నియోజకవర్గంలో ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. పాఠశాలలకు విద్యార్థులను తరలించే విషయంలో ప్రయాణ ఛార్జీల పేరిట ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులు కావాలని ప్రయివేటు విద్యా సంస్థలకు పంపుతున్నారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నారు.

**యాజమాన్యాల కక్కుర్తి...**

కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తున్న ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాల తీరుపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు చిన్న బస్సు కెపాసిటీకి అనుగుణంగా 24 మంది, పెద్ద బస్సు కెపాసిటీకి సంబంధించి 55 మంది విద్యార్థులను ఎక్కించుకునేందుకు అనుమతి ఉంది. ఈ నిబంధనలు చిన్న బస్సుల్లో 40 నుంచి 50 మందిని, పెద్ద బస్సుల్లో 100కు పైగా విద్యార్థులను ఎక్కిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రవాణా శాఖ అధికారులు తరచుగా వాహనాలను తనిఖీ చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నా.. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను పెడచెవిన పెడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 154 ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులు ఉన్నాయని వాటిని వెంటనే ఫిట్‌నెస్ చేసుకోవాలని లేని పక్షంలో రవాణా శాఖ వారి దాడుల్లో పట్టు బడితే భారీ మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుంది.

**నిబంధనలు ఇవే...**

పాఠశాల బస్సుల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలి. కెపాసిటీని బట్టి నిబంధనల మేరకే పిల్లలకు పాఠశాలలకు తరలించాలి. 60 ఏళ్ల పైబడిన డ్రైవర్లను నియమించరాదు. బస్సుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు పిల్లలు సురక్షితంగా బయటపడానికి బస్సులకు అత్యవసర ద్వారాలు ఉండాలి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు, ఐదేళ్ల అనుభవం ఉన్న వారినే బస్సు డ్రైవర్‌గా నియమించుకోవాలి. డ్రైవర్ ఆరోగ్య, మానసిక పరిస్థితులపై వైద్యులు పరీక్షలు చేసిన ధ్రువపత్రం ఉండాలి. బస్సుల్లో తప్పకుండా అటెండర్ ఉండాలి. విద్యార్థుల హాజరును తప్పక నమోదు చేయాలి. ప్రతి బస్సులోనూ ఫస్ఎయిడ్ బాక్సు అందుబాటులో ఉండాలి. పిల్లలు బస్సు ఎక్కడానికి అనువుగా మెట్లు ఉండాలి. పిల్లలను పాఠశాలలకు చేర్చేటప్పుడు గాని, లేదా ఇంటికి తరలించేటప్పుడు కాని టైర్లు పంక్చరైతే మార్చుకునేందుకు సేఫ్టీ టైర్లను సిద్ధంగా ఉంచుకోవాలి.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులను తరలించే బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాలి. బస్సుల్లో సీటింగ్ కెపాసిటీ వరకే విద్యార్థులను ఎక్కించుకోవాలి. బస్సుల్లో ప్రతిరోజు విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేసేందుకు అటెండెన్స్ తప్పక నియమించాలి. 15 ఏళ్ళ పైబడిన స్కూల్ బస్సులు నడపరాదు. ఈ నిబంధనలను పాటించని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం.



**- పి.దినేష్ చంద్ర, డిటిఒ, రాయచోటి.**

# సమగ్రాభివృద్ధిలో అధికారులు భాగస్వామ్యం కావాలి

**- సమీక్షా సమావేశంలో కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే 'గడికోట'**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి నియోజకవర్గం సమగ్రాభివృద్ధిలో అధికారులు చిత్తశుద్ధితో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ఃలోని స్పందన హాలులో రాయచోటి నియోజకవర్గం అభివృద్ధిపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒ, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వారు వివిధ అంశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి, విద్యుత్, పంచాయితీ రాజ్, గృహ నిర్మాణం, పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, క్రీడా మైదానం, ఎంఐజి లేఅవుట్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తున్నదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ జగనన్న ప్రభుత్వంలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రాయచోటి నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రశంసించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో నూతన ఒరవడిని తెచ్చే విధంగా రైతులకు లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు. ఆర్బికేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు వైయస్సార్ యంత్ర పరికరాలను రైతులకు అందిస్తున్నామన్నారు. దీని ద్వారా రైతుల్లో విశ్వాసం పెంపొందించే విధంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ అధికారులు వారి విధులు సక్రమంగా నిర్వహించి సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి, విద్యుత్, పంచాయితీ రాజ్, గృహ నిర్మాణాలు, మున్సిపల్ పరిధిలో పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, క్రీడా మైదానం ఏర్పాటు, ఎమ్ఐజి అవుఔట్ తదితర అభివృద్ధి పనులలో ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఆయా శాఖల అధికారులందరూ బాధ్యతాయుతంగా రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలన్నారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డిఒ రంగస్వామి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, ఎంపిపిలు ఆవుల నాగశ్రీ లక్ష్మీ, మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిపి గడికోట జనార్దన్‌రెడ్డి, పోలు సుబ్బారెడ్డి, బిసినేత పల్లపు రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు ఎంపిడిఒలు పాల్గొన్నారు.

## వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వైద్య రంగంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని దిగువ అబ్బవరంలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్యసేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2500 జనాభాకు వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ లును ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.ఇందులో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించా రన్నారు. ఈ క్లినిక్ లో12 రకాల వైద్యసేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 65 రకాల మందులతో పాటు 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్ మెంట్ అందుబాటులో ఉంటుం దన్నారు. నియోజకవర్గంలో 73 సచివాలయాల భవన నిర్మాణాలకు గాను 60 సచివాలయాల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, రైతు భరోసా కేంద్రాల భవనాలు 48 పూర్తయ్యాయన్నారు. 60 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలకు గాను 31 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు ఇప్పటివరకు పూర్తయ్యాయని, మిగిలిన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాంత్ రెడ్డి అధికారులును ఆదేశించారు.

## ఆర్‌బికెల్లో అవసరమైన ఎరువులు

**- జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్ర నాయక్**

ప్రజాశక్తి-రాయచోటి

రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ జిల్లాలోని ఎరువుల తయారీదారుల ప్రతినిధులతోనూ, ఏడు డివిజన్లలోని హబ్ మానేజర్‌లతో జిల్లాలోని ఎరువుల నిలువలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ జిల్లాకు రావలసిన ఎరువులను కంపెనీ ప్రతీనిదులు సకాలంలో పంపిణీ చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచి రైతులకు సేవలు అందించాలని హబ్ మేనేజర్‌లను కోరారు. ప్రస్తుతం సీజన్ మొదటి దశలో ఉన్నామని తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 13,000 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సరైన వర్షాలు కురిసి సాగు విస్తీర్ణం పెరిగినట్లయితే అవసరం మేరకు ఇంకా ఎరువులు తెప్పించేగలమని తెలిపారు. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం 39 వేల టన్నులకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద్ అహ్మద్, వ్యవసాయ అధికారి బి.వెంకట్ మోహన్, కంపెనీ ప్రతినిధులు, హాబ్ మేనేజర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

## పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో విద్యుత్ పోరుబాట పేరుతో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపటం దారుణమన్నారు. అప్పుల కోసం వైసిపి ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సంస్కరణలకు దాసోహం అవడం శోచనీయమన్నారు. ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉందని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ ఛార్జీలు వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. మోడీ, జగన్ కలిసి సామాన్యుల నడ్డి విడుస్తున్నారని, చిరువ్యాపారుల నుండి చిన్న పరిశ్రమల వరకూ ప్రతిఒక్కరూ బాధితులేనని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి జూన్ 30న ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, అందుకోసం ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా జరుగు ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సహదేవ, అంజి, నాగరాజు పాల్గొన్నారు.

## నేడు పెనగలూరుకు అలీ రాక

ప్రజాశక్తి-రాయచోటి

ఎపి ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ మొహమ్మద్ అలీ శనివారం పెనగలూరుకు రానున్నారని ఎపి ఆన్‌లైన్ సిఇఒ యనమల భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి నుంచి పెనగలూరుకు వస్తారన్నారు. పెనగలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి ఆన్‌లైన్ వారి సౌజన్యంతో పాఠశాలకు బెంచ్‌లు, వసతి గృహానికి మంచాలు, పరుపులు, ఆర్ఒ ప్లాంట్లను అలీ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

## మహిళలు స్వయం ఉపాధి పొందాలి

### -ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

మహిళలు కుట్టుమిషన్ల ద్వారా స్వయం ఉపాధి పొంది తమ కాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలోస్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందిన 60 మంది నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్లను ఎంపిడిఒ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో శిక్షణ తీసుకొని యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతమవుతుందని అన్నారు. యువత ఉద్యోగాలు పొందేలా చాలా పథకాలను చేపట్టిందని, అందులో భాగంగానే రైల్వే కోడూరులో నైపుణ్య హబ్‌లను ఏర్పాటు చేసిందని, జిల్లా యువత ఇటువంటి సౌకర్యాలను ఉపయోగించుకొని, ఉన్నత ఉద్యోగాలు పొందాలని అన్నారు. 60 మంది శిక్షణ పొందిన మహిళలకు ఎపిఎండిసి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 60 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరాజు, జడ్‌పిటిసి శ్రీరత్నమ్మ, నైపుణ్యాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజ్ గోపీనాథ్, రాష్ట్ర అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, శిక్షకులు పార్థసారధి పాల్గొన్నారు.

## ప్రజల ముంగిట రిజిస్ట్రేషన్ సేవలు

**ప్రజాశక్తి-సుండుపల్లి**

రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశ్యంతో సచివాలయాలలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని సబ్‌రిజిస్ట్రార్ ఆర్.కేశవప్రకాష్ తెలిపారు. శుక్రవారం టి.సుండుపల్లి సచివాలయంలో గోడ పత్రాలను విడుదల చేశారు. సచివాలయంలో ఇంటిస్థలం, వ్యవసాయభూములు, వీలునామాలు, ఇసి మార్కెట్ విలువ, హిందూ వివాహం, ప్రత్యేక వివాహం వంటి దస్తావేజు రిజిస్ట్రేషన్ల సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, డిజిటల్ అసిస్టెంట్ నవీన్ గంగాధర, కార్యాలయ పాల్గొన్నారు.

## రేపు పెనగలూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

ఈనెల 25న ఆదివారం నియోజకవర్గంలోని పెనగలూరులో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత రూపానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురై అరవింద్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ పర్యవేక్షణలో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోగులకు, వారితోపాటు వచ్చే సహాయకులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రత్యేక వాహనంలో అరవింద్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందిస్తామని చెప్పారు.

## ప్రతి విద్యార్థీ బడిబాట పట్టాలి

**ప్రజాశక్తి-రామాపురం**

ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిఎస్‌టియు రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్‌హక్ అన్నారు. మండలంలోని నీలకంఠరావుపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు జగనన్న విద్య కానుక, అమ్మబడి, జగనన్న ఆణిముత్యాలు మధ్యాహ్న భోజనంలో భాగంగా చిక్కీలు, గుడ్లు, రాగి జావా, యూనిఫామ్, ఖర్చు లేకుండా మూడవ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్‌తో నాణ్యమైన విద్య విద్యను అందిస్తున్నామన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయని, అన్ని మౌలిక వసతులు కలిగి ఉన్నాయని అన్నారు. చదువులకు పిల్లలు దూరం కాకూడదని ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకవచ్చిందని అన్నారు. ప్రతి విద్యార్థి డిగ్రీతో బయటకు రావాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ సిలబస్ కూడా తీసుకవస్తారని చెప్పారు.

## స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-పీలేరు**

పట్టణంలోని పలు ప్రయివేట్ వైద్యశాలలు నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. డిఎంహెచ్ఒ డాక్టర్.కొండయ్య ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి పట్టణంలోని శశి ఆస్పత్రి ఎస్.కె.ఆర్ ఆస్పత్రి, చిన్నారి ఆస్పత్రి, ప్రసాద్ ఆస్పత్రి, సాయిలీల నర్సింగ్ హోమ్, స్టారలైట్ డగ్నోస్టిక్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కాన్ సెంటర్లను నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టప రమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. స్కానింగ్ చేసి అడ, మగ అని చెప్పడం, అడబిడ్డ అని తెలిపి గర్భస్రావం చేయడం పిసిపిఎన్‌డిటి1994 చట్టం ప్రకారం నేరమని తెలిపారు. స్కాన్ సెంటర్లు రిపోర్టులు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, నెలవారి రిపోర్టులు సక్రమంగా, సకాలంలో పంపాలని ఆదేశించారు. ఆడబిడ్డలను కాపాడు కోవాల్సిన అవసరం సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా డిఇఎంఒ దేవశిరోమణి, రేగళ్ళ హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, రాజగోపాల్, సూపర్వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## నీటిశుద్ధి ప్లాంట్‌ని సందర్శించిన జనసేన నాయకులు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మండల పరిధిలోని చిప్పిలి గ్రామంలోని కొండమీద ఉన్న నీటిశుద్ధిప్లాంట్‌ని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా అభివృద్ధి శూన్యమన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గడప గడప తిరుగుతూ 98 శాతం హామీలు నెరవేర్చామని గొప్పలు చెప్పు కుంటున్నారని విమర్శించారు. మదనపల్లి ప్రజల దాహార్తిని తీర్చే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దాదాపు 90 శాతం పూర్తయినా మిగతా పదిశాతం పను లను పూర్తి చేయకపోవడం వలన పేద, మధ్య తరగతి కుటుంబాలు వందలాది రూపాయలు వెచ్చించి శుద్ధి నీటిని కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వదిలి పనులు పూర్తి చేయా లన్నారు. లేనిపక్షంలో జనసేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్య క్రమా లను ఉదృతం చేస్తామన్నారు.కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం రాయల్, రాష్ట్ర చేనేత విభాగ నాయకులు అడపా సురేంద్ర, మదనపల్లి రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, గడ్డం లక్ష్మీపతి, జనార్ధన్, గండి కోట లోకేష్, నవాజ్, సత్య పాల్గొన్నారు.


నీటిశుద్ధి ప్లాంట్‌ని సందర్శిస్తున్న జనసేన నాయకులు

# అందరికీ విద్య, ఉపాధి కోసం పోరాటం : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

అందరికీ విద్య, ఉపాధికై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఐటిఐ కాలేజ్ కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు రమణ మాట్లాడుతూ కరువు కాటకాలతో నిరుద్యోగ యువకులు ఐటిఐ పూర్తి చేసుకొని తగిన ఉద్యోగాల్లేక ఉపాధికోసం వలస వెళుతున్నారని అన్నారు. ఇది తెలిసిన పాలక ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అందించడంలో విఫలంవుతున్నారని అన్నారు. కనీస సౌకర్యాలు విద్యా ర్థులకు కల్పించడం లేదన్నారు. కోడూరు ప్రాంతంలో జ్యూస్ ఫ్యాక్టరీ, మంగంపేట మైనింగ్ పరిశ్రమలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిం చాలని అన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నిరుద్యోగ యువతకు విద్యార్థులకు గల్ఫ్ దేశాలకు వెళ్ల కుండా ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వేలాది మందికి ఉద్యోగాలు దక్కే అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 14 మందిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఐటిఐ కళాశాల అధ్యక్షులుగా భార్గవ్, కార్యదర్శి వినోద్ ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శులు లోకేష్ , నవనీత్, ప్రవీణ్, వెంకట్, ఉదయ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సబ్రణమ్యం, జీవన్, పవన్, రణమ, ధనుంజయ్‌లను కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**


బి.కొత్తకోట : ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తూ, పేదలకు అండగా నిలబడుతుందని అన్నారు. శుక్రవారం రెడ్డివారిపల్లి పంచాయతీ దివిట 'వారిపల్లె, నాగప్పనాయన బురుజులో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందిన వివరాలను చదివి వినిపించి, బుక్ లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. గ్రామంలో తాగునీటి పైపు లైన్లు, మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ సమస్యలు తదితరాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, నాయకులు నరేంద్ర రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, హేమంత్, చంద్రమోహన్, దయాకర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మౌలాలి, తహసిల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, పోలీసుసిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **బి.కొత్తకోట** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోటవూర్ పంచాయతీలో బుద్దలవరిపల్లి, కొండ క్రాస్, గుండ్లగుట్టవరి పల్లి, బిల్లురివారిపల్లి, అమర నారాయణాపురం, నాయనబండపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని, పేదలైన అర్హులందరికీ సకాలంలో అందాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించడానికి గ్రామ సచివాలయాలు దోహదపడుతున్నాయని అన్నారు. ఇప్పటికే మండ లంలో దాదాపు సిసి రోడ్లు, తాగునీటి ట్యాంకులు, మురుగనీటి కాలువల నిర్మా ణాలు పూర్తయ్యాయన్నారు. ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరి తగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో 'విశ్వం' విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-కురబలకోట**

అంగల్లు సమీపంలోని విశ్వం కళాశాలలో ఎంబిఎ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగు ళూరుకు చెందిన ఫ్రాంక్ ఫిన్ కంపెనీ వారు ఎంపికలు నిర్వహించారని అన్నారు. ఆరు మంది విద్యార్థులు హెచ్ఆర్ రిక్రూటర్‌గా, 15 మంది టెలి కౌన్సిలర్లుగా ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులతను కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ రమణరెడ్డి, డైరెక్టర్ వెంకటరమణరెడ్డి, ఎంబిఎ హెచ్ఒడి శంకర్‌నాయక్ విద్యార్థులను అభినందించారు.

## 30న మహాధర్నాను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-పీలేరు**

రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 30న విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురి రామచంద్ర తెలిపారు. శుక్రవారం పీలేరులో మహాధర్నా జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికల ఆవిష్కరణ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 30 ఉదయం 10 గంటలకు విజయవాడలో మహాధర్నా చేప డుతున్నామని అన్నారు. గత ఏడాది పంటలు నష్టపోయిన రైతులం దరికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలబీమా వెంటనే విడుదల చేయాలని, రైతు పెట్టిన ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయిం చాల న్నారు.అన్ని రకాల భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని, నకిలీ విత్త నాలు చలామణిలోకి రాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్య క్షులు ధనాసివెంకట్రామయ్య, పురుషోత్తం, ఎం.రాధా, రమణ, బి. శ్రీరాములు, రమణ, ఇసుకపల్లి రామకృష్ణయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో స్థానిక ఎంఇఒ, ఎంపిడిఒ ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి ఎంపిపి ముదా బాబుల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాడు నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని అన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలని ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ నాగ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పనులను వేగవంతం చేయండి

**ప్రజాశక్తి-పెద్దమండ్యం**

మండలంలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను వేగవంతం చేయాలని వాటర్‌షెడ్ పీడీ లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో జరుగుతున్న వాటర్ షెడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెద్దమండ్యం, పాపేపల్లి, సి.గొల్లపల్లి, కలిచెర్ల, ఎన్ఒపల్కి , కోటకాడపల్లి, గుర్రంవాండ్లపల్లి పంచాయతీ ప్రస్తుతం రూ.20 లక్షలతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పిఒ రవీంద్రుడు, జెఇలు మోహన్, ఢిల్లీ బాబు, సిసి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మాతమ్మ జాతరలో రాజకీయ ప్రముఖులు

**ప్రజాశక్తి-రాజంపేట రూరల్**

పట్టణ పరిధిలోని డిబియన్‌పల్లె గ్రామంలోని శ్రీమాతమ్మతల్లి జాతర వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ జాతరలో పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఎల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.35 వేలు జాతరకు విరాళాన్ని అందించారు. శుక్రవారం రాజంపేట బిజెపి పార్లమెంటు కన్వీనర్ సాయి లోకేష్, జనసేన నాయకులు అతికారి దినేష్, కోలాటంహరి పాల్గొన్నారు. సాయి లోకేష్ రూ.25వేలు, జనసేన నాయకులు అతికారి దినేష్, కోలాటం హరి సంయుక్తంగా విద్యుద్దీపాలంకరణ ఖర్చుకు రూ.60 వేలు విరాళాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు రాజకీయ ప్రముఖులను దుశ్శాలువాతో సత్కరించారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలో నూతనంగా భాద్యతలు చేపట్టిన ఎంఇఒ-1 గంగిరెడ్డి ఎంఇఒ-2 అనంత కృష్ణ, ఉపాధ్యాయులు ఎల్.చంద్ర ఓబుల్ రెడ్డి, బివి సుబ్బరాయుడు, కె.రమేష్‌జోషి తదితరులను యుటిఎఫ్ నందలూరు మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నందలూరు హై స్కూల్లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు షేక్ రౌఫ్‌బాషా, ఎన్.శామ్యూల్, జి.కృపానందం,ముక్కర హరినాధ్, శివ వరప్రసాద్, నూకల నరసింహులు, సుధాకర్, ఇమాంబాషా, ఆరేం చిన్న రెడ్డన్న, ఆనంద్, నిత్య పూజ, రమణ, పిచ్చయ్య, కిరణ్, బాబు, అలెక్స్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మరోమారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం మండలంలోని కోటావురు గ్రామ సచివాలయం పరిధిలోని గుండ్లగుట్టవారిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక నిరుపేద కుటుంబం సురేంద్ర అతని భార్య ఇద్దరు అనారోగ్యంతో మరణించడంతో వారి ఇద్దరి కుమార్తెలు అనాథలుగా మిగిలారు. మొదటి కుమార్తె పవిత్ర ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపులో 834 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. తల్లిదండ్రులను కోల్పోవడం,ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఇంటి దగ్గరే ఉందని విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే మదనపల్లి పట్టణంలోని కృష్ణచైతన్య నర్సింగ్ కళాశాల యాజమాన్యానికి ఫోన్ చేసి పవిత్ర చదువు పూర్తయ్యే మొత్తం ఖర్చు తానే భరిస్తానని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాము బాగా చదివి ఎమ్మెల్యేకి మంచి పేరు తీసుకొస్తానని పవిత్ర తెలిపింది. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**ప్రజాశక్తి-కలకడ**

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడలో ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ఇద్దరి కన్నా ఎక్కువ మందితో ప్రయాణించకూడదని అన్నారు. చిన్నపిల్లలు వాహనాలను నడపరాదని అలాగ నడపితే వారి తండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోల లో వాహనాలలో నాటు సారా, డ్రిప్ వైర్లు వస్తువులు తరలించరాదని అలాంటివి జరిగితే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సునీల్ శశికుమార్, పోలీస్ సిబ్బంది రమణ, రమేష్ ,సహదేవ, డ్రైవర్ రమేష్ పాల్గొన్నారు.

## సర్వాంగ సుందరంగా క్రికెట్ స్టేడియం

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

సర్వాంగ సుందరంగా క్రికెట్ స్టేడియం రూపుదిద్దుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణం నక్కావాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ప్లేగ్రౌండ్, ప్రహరీగోడ నిర్మాణ పనులు, అథ్లెటిక్‌ట్రాక్, ఫ్లడ్ లైట్లు, రహదారుల నిర్మాణాలు, పెవిలియన్ బిల్డింగ్, గ్యాలరీ తదితర నిర్మాణాలపై ఆర్‌అండ్ బి అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ గిరీశ్వర రావుతోనూ, గుత్తేదారులుతో ఆయన కూలంకషంగా చర్చించారు. ఆగస్టులోగా నిర్మాణపు పనులను పూర్తి చేయాలని సూచించారు. స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బా రెడ్డి, జెడ్‌పిటిసి వెంకటేశ్వర రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, మదనపల్లె పరిశీలకులు హబీబు ల్లాఖాన్, బిసినేత పల్లపురమేష్, తిరుపాల్‌నాయుడు, ఆంజనేయులునాయుడు, వెంకట్రా మిరెడ్డి, బిసిసెల్ విజయభాస్కర్, అమరనాధరెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## వైసిపి పాలన అవినీతిమయం : ఆర్ఆర్

**ప్రజాశక్తి-రాయచోటి**

వైసిపి పాలన అవినీతిమయమైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. టిడిపి జాతీయ నాయకులు నారాచంద్రబాబు నాయుడు పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని చెన్నముక్కపల్లె పంచాయితీ కుమ్మర మిట్టలో టిడిపి ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక వైసిపి పాలనకు నిరసగా రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ, రాష్ట్రానికి ఇదేంఖర్మ అనే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్‌రెడ్డి వార్డులో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం గడిచిన నాలుగు సంవత్సరాలలో రాష్ట్రంలో కొనసాగిస్తున్న అవినీతి, అరాచక, నియంతృత్వ పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిగాజుల ఖాదర్‌బాషా, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, బాబ్జి, ఐష్ వెంకటేష్ పాల్గొన్నారు.

## రిజర్వాయర్ బాధితులకు ఆర్అండ్ఆర్ కాలనీ

**ప్రజాశక్తి-కురబలకోట**

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ బాధితులకు అదిరిపోయేలా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో మండలంలోని పిచ్చలవాండ్లపల్లె, బి,.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద శుక్రవారం రైతులతో ముఖాముఖి నిరూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు కోరిన పరిహారం, ఆపై పునరావాసం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాల కృష్ణ ,ఆర్‌డిఒ మురళి, సర్పంచ్ సురేంద్ర, పిఆర్ఒ కులదీప్‌రెడ్డి రిజర్వాయర్ బాధిత రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ప్రిన్సిపల్ వెంకట సత్యనారాయణ

## 'ఆదిత్య' కళాశాలలో జాతీయ సమావేశం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కలికిరి జెఎన్‌టియు ప్రిన్సిపల్ ఎస్.వెంకటసత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్స్ అండ్ ఇన్వెన్షన్స్ మధ్య చాలా తేడా ఉందని, ఏదైనా వస్తువుని కొత్తగా కనుగొన్నప్పుడు ఇన్వెన్షన్ అంటామని, దానిమీద పరిశోధన చేస్తే వచ్చేదాన్ని ఇన్నోవేషన్ అంటారని తెలిపారు. ఎఐఎంఎల్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్.ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కాన్ఫరెన్స్ సమావేశాల్లో పాల్గొని వారి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు రీసెర్చ్ చేయవలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జె.జగన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పంపించిన 220 పరిశోధన పత్రాలలో 193 పరిశోధన పత్రాల సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు పి.గంగాధర్ రెడ్డి, కె.శ్రీలలిత, ఆర్‌అండ్‌డి సిబ్బంది హెచ్ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్రలో టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నెల్లూరు జిల్లా వెంకటగిరిలో కొనసాగుతోంది. టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, సీనియర్ నాయకులు పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, టిడిపి నాయకులు పికె.నాయుడు, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, మాజీ వైస్ ఎంపిపి గునిపాటి చెన్నరాయుడు, మాజీ సర్పంచ్ శంకరయ్య నాయుడు, కల్లా చలపతి, నాయుడోరి రమణ, కొమ్మ శివ, రమేష్ పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని రాబోయే ఎన్నికలలో ప్రజలు టిడిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాశక్తి-సుండుపల్లి**


చెత్తను తొలగిస్తున్న కార్మికులు

మండలంలోని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పంచా యతీ కార్యదర్శి సురేష్‌బాబు పేర్కొ న్నారు. మండలం కేంద్రంలో పంచా యతీ సహాయకులతో పారిశుధ్య పను లు నిర్వహించినట్లు తెలిపారు. రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించి బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశామని చెప్పారు. మండల కేంద్రంలోని పురవీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను ట్రాక్టర్ సహాయంతో డంపింగ్‌యార్డ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎక్కడైనా పారిశుధ్య సమస్యలుంటే స్థానికులు పంచాయితీ సిబ్బందికి కానీ, అధికారులకు కానీ తెలిపాలని కోరారు. మండల కేంద్రంలో పాడైపోయిన వీధిదీపాలను మర మ్మతులు చేయించామని, కొన్నిచోట్ల వీధిదీపాల కొరత ఉందని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు.

## జనభగీరథితో అంగన్వాడీల అభివృద్ధి

**ప్రజాశక్తి-రామాపురం**

జన భగీరథి కార్యక్రమంతో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి దోహదపడుతుందని లక్కిరెడ్డిపల్లె ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం జన భగీరథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ నుంచి చిన్న పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న సేవలు గురించి తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమికవిద్యను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పద్మజ, అరుణమ్మ, హుస్సేన్‌బీ, అంగ న్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, రహజాన్, ఝాన్సీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు ముందడుగు వేయాలి : ఎంపిపి

**ప్రజాశక్తి-నందలూరు**

ప్రజాసేవలో ఇంకొక అడుగు ముందుకు వేయాలని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సురక్షపై సిఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు తిలకించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యానందం, ఎంపిడిఒ సౌభాగ్యం, ఎంఎల్ఒ శ్రీనివాసులు, జెసిఎస్ మండల సచివాలయాల కన్వీనర్, కో-ఆప్షన్ మెంబర్ కలీంఖాన్, వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, మండల నాయకులు, గడికోట సుబ్బారెడ్డి, నాగేంద్ర, ఎల్లంరాజుపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

**బి.కొత్తకోట :** హర్‌దిల్ మే వైఎస్ఆర్, హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పెద్దతిపసముద్రం, కందుకూరు మసీదుల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా పర్యటించారు .స్థానిక ముస్లిం పెద్దలతో, మసీదు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి సిఎం జగన్ ముస్లింల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మసీదుల్లో ముస్లింలకు సంబంధించిన సమస్యలను తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి ఎంపీ మిథున్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. మసీదు పెద్దలు, కమిటీ సభ్యులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మహమూద్, కందుకూరు సర్పంచ్ రహమతుల్లా, ఉపసర్పంచ్ ఆసిఫ్‌బాషా, సాదిక్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**రాయచోటి టౌన్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ మాట్లాడుతూ కళాశాల ప్రారంభమై దాదాపు పది రోజులుగా వస్తున్న ఇప్పటివరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు. కొన్ని కళాశాలలో మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించవలసిన ప్రభుత్వంపై ఉందన్నారు.

## అన్నను కత్తితో పొడిచిన తమ్ముడు

**ప్రజాశక్తి-చిన్నమండెం**

అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు..చిన్నమండెంకు చెందిన షేక్‌బాషాఅలీ ద్విచక్ర వాహనంలో తన సోదరుడు షేక్ సయ్యద్‌బాషా, కొడుకు యాసిన్‌తో కలసి రాయచోటి నుంచి చిన్నమండెంకు వస్తుండగా అన్నదమ్ముళ్ల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసిందన్నారు. ఈ ఘర్షణలో తమ్ముడు షేక్‌బాషాఅలీ తన అన్న అయిన షేక్ సయ్యద్‌బాషాపై కత్తితో దాడి చేయగా చేతికి, తలకు గాయాలయ్యాయని చెప్పారు. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.